సాక్షి వరంగల్

మంగళవారం । 2 । జూలై । 2024



మట్టి, ఇసుక కావాలి

కేఎంటీపీలో యంగ్ వన్ కంపెనీ పనులు త్వరగా చేపట్టేందుకు మట్టి, ఇసుక కావాలని ఆ కంపెనీ ప్రతినిధులు కోరారు. - 8లో▸



ప్రమోషన్..పరేషాన్

టీజీఎస్ ఆర్టీసీ టైర్ వర్క్‌షాపులో పనిచేస్తున్న కార్మికులపై యాజమాన్యం, అధికారులు వివక్ష చూపుతున్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $35^0/25^0$

జిల్లాలో ఆహ్లాదక వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల చిరుజల్లు లు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైద్య వృత్తిని వ్యాపారం చేయొద్దు



గీసుకొండ: వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని, దాన్ని వ్యాపారంగా మార్చకుండా మానవతా దృక్పథంతో సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె. వెంకటరమణ అన్నారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన డాక్టర్స్ డే సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు వైద్య సేవలను అందించే వారిని దేవుళ్లుగా కొలుస్తారన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయడంలో వైద్యులు కీలకంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓతో పాటు పలు ప్రోగ్రాం అధికారులను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధార్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ ప్రకాశ్, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, ఫార్మసీ ఆఫీసర్ బత్తిని సుదర్శన్‌గౌడ్, సిబ్బంది రజనీకాంత్, రాధిక, రాధిక, అర్చన, సునిత, నితిన్‌రెడ్డి, సంజీవ్, వెంకటేశ్వర్లు, అంజద్, సృజన, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

కాశోజీ సెంటర్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పార్థసారథి, ల్యాదల్ల శరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా నాయకులతో కలిసి సోమవారం కలెక్టర్ సత్యశారదాదేవికి వినతి పత్రం అందజేశారు. అనంతరం పార్థసారథి, శరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ.7 వేల కోట్లకు పైగా స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు మాటం శివకుమార్, సంతోష, మేకల అభిరామ్, ప్రభాస్ రాజు, సాయి పాల్గొన్నారు.

సబ్సిడీపై యంత్ర పరికరాలు ఇవ్వాలి

దుగ్గొండి: ప్రభుత్వం రైతుల సలహాలు, సూచనలు తీసుకోవడం శుభ పరిణామమని, అదే ప్రభుత్వం సబ్సిడీపై పరికరాలు, యంత్రాలు ఇచ్చి వ్యవసాయాన్ని ప్రగతి బాట పట్టించాలని పలువురు రైతులు జిల్లా వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని నాచినపల్లి, దుగ్గొండి, మహ్మదాపురం పీఏసీఎస్‌ల పరిధి రైతులతో రైతు భరోసా పథకంపై సోమవారం రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. 10 ఎకరాల వరకు సాగు చేసుకునే వారికి రైతు భరోసా ఇవ్వాలన్నారు. ఇదే సమయంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా సబ్సిడీపై రైతులకు మోటార్లు, పైపులైన్‌లు, యంత్ర పరికరాలు సబ్సిడీపై అందిస్తే సాగు మరింత సులభం అవుతుందని జేడీఏ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం జేడీఏ ఉషాదయాళ్ మాట్లాడారు. రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు. యూరియా ఎలాంటి కొరత లేకుండా బ్లాక్‌లో అమ్మకుండా జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘాల రిజిస్ట్రార్ నారాయణ, నర్సంపేట ఏడీఏ నగేష్, ఏఓ దయాకర్, సొసైటీల చైర్మన్‌లు రాజేశ్వర్‌రావు, మహిపాల్‌రెడ్డి, పైడి, సీఈఓలు ఓంకార్, రమేష్, భిక్షపతి, ఏఈఓలు హన్మంతు, రాజేష్, విశ్వశాంతి పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి

కాశోజీ సెంటర్: కేంద్రంలోని బీజేపీ ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజా వ్యతిరేక విధానాలను, చట్టాలను ఉపసంహరించుకోవాలని ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి పాలనలోనే కేంద్ర ప్రభుత్వం అనేక ప్రజావ్యతిరేక చట్టాలు, నిర్ణయాలు అమలుకు పూనుకుందని, అందులో భాగంగానే జూలై 1 నుంచి అమలు చేయనున్న క్రిమినల్, లా చట్టాలను వివరించారు. గత ప్రభుత్వంలో 350 స్థానాలు ఉన్న బీజేపీ ఈ సారి 293 స్థానాలకు తగ్గి ప్రజలు కొట్టిన దెబ్బకు బీజేపీ మైనార్టీతో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంద రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు, నాగెల్లి కొమురయ్య, వంగల రాగసుధ, కనకం సంధ్య, నాయకులు సుంచు జగదీశ్వర్, కుమారస్వామి, మల్లికార్జున్, రమేష్, నర్సయ్య, ప్రభాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లాకు తలమానికంగా నిలుస్తున్న పాకాల సరస్సు వర్షాలు లేక వెలవెల పోతుంది. 30 ఫీట్లకు చేరుకుంటే మత్తడి పోసే సరస్సు కింద 30 వేల ఎకరాలకు వరి పంట సాగునీటి పరంగా ప్రధాన నీటి వనరు. ప్రస్తుతం 17 ఫీట్లు మాత్రమే నీరు ఉంది. భారీ వర్షాలు కురిస్తే తప్ప సరస్సు నిండే పరిస్థితి లేదు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు నర్సంపేట నియోజకవర్గంలోని మామిండ్ల వీరయ్యపల్లి గ్రామానికి చెందిన గాదె కుమారస్వామి. తనకున్న ఏడు ఎకరాల్లో రెండు ఎకరాల్లో మొక్కజొన్న, ఎకరంలో పత్తి, మరో నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నాడు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురువకపోవడంతో ఇప్పటికే రెండు సార్లు పత్తి విత్తనాలు నాటినా.. మొలకెత్తలేదు. చేసేది ఏమి లేక మరోసారి అప్పు చేసి విత్తనాలు తెచ్చి నాటించాడు. దీంతో దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతు భావిస్తున్నాడు.

వాడుతున్న ఆశలు

నిండని చెరువులు, కుంటలు
- ఎండుతున్న పంటలు
- కురిసింది కొంతే.. ఆందోళనలో రైతులు
- జిల్లాలో లోటు వర్షపాతం



నర్సంపేటలో సాగవుతున్న మొక్కజొన్న పంటలో దిగాలుగా ఆకాశంవైపు చూస్తున్న రైతు

నర్సంపేట: జిల్లాలో వర్షాలు ఆశించినంత లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సాధారణ వర్షపాతం కంటే తక్కువగా నమోదు అవుతుండటం, రానున్న రోజుల్లో వర్షాలు సమృద్ధిగా పడకుంటే పంటలు కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా కొద్దిపాటి వర్షాలు కురుస్తున్నప్పటికీ జిల్లాలోని 14 మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే లోటు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని ప్రధాన నీటి వనరులైన పాకాలకు ఈ వర్షాకాల సీజన్‌లో నీటి మట్టం పెరగకపోవడం ఖరీఫ్ సీజన్‌పై మబ్బులు కమ్ముతున్నాయి. ఇప్పటి వరకు పత్తి, మొక్కజొన్న విత్తనాలు వేసుకున్న రైతులకు మొలకలు వచ్చినప్పటికీ భూమి కొద్ది మేర మాత్రమే తడిచింది.

పంటల సాగు వివరాలు...

జిల్లాలో 80 శాతం వ్యవసాయ ప్రాంతంగా ఉంది. ఖరీఫ్ సీజన్‌లో 2,90,989 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో పత్తి, మొక్కజొన్న, వరి పంటలు ప్రధానమైనవి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నాటి నుంచి 60శాతం పంటలు మాత్రమే సాగుకు సిద్ధమయ్యారు. సమృద్ధిగా వర్షాలు కురిస్తేనే మిగతా పంటలు సాగు చేయాలనే ఆలోచనలో రైతులు ఉన్నారు.

అడుగంటిన జలాశయాలు..

జిల్లాలో చిన్న మధ్య తరహా నీటి వనరుల్లో ప్రధానమైన పాకాల, రంగాయ, కోనాయమాకుల, ఆత్మకూరు, కటాక్షపూర్, పర్వతగిరి చెరువుల్లో నీరు అడుగంటి పోయాయి. వాస్తవానికి జూలై ప్రారంభం నాటికి వర్షాలు సమృద్ధిగా కురిసేవి. ఈ ఏడాది ఎండలు మండిపోవడంతో చెరువులు, కుంటల్లో నీరు ఇంకి పోయింది. భూగర్భ జలాలు పడిపోవడంతో బోర్లు వట్టిపోయాయి. బావుల్లో నీరు ఇంకిపోవడంతో భారీ వర్షాలు కురిస్తే తప్ప భూగర్భ జలాలు పెరిగే అవకాశం లేకపోవడంతో బోర్లు, బావుల కింద పంటల సాగు చేస్తున్న రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

సీజన్ ప్రారంభంలోనే నష్టం..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు వేల రూపాయలు వెచ్చించి పత్తి విత్తనాలు విత్తారు. అనంతరం వర్షాలు ముఖం చాటేయడంతో పత్తి విత్తనాలు వేసుకున్న రైతులకు నిరాశే ఎదురైంది. విత్తనాలు మొలకెత్తకపోవడంతో తిరిగి రెండవ సారి పత్తి విత్తనాలు కొనుగోలు చేసి విత్తుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. దీంతో పెట్టుబడి భారం మరింత ఇబ్బందికి గురి చేసింది.

జూలై పైనే ఆశలు..

పంటల సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచిపోతున్నప్పటికీ అడపా దడప కురుస్తున్న వర్షాలు తప్ప అత్యధిక వర్షం లేకపోవడంతో రైతుల్లో సందిగ్ధత నెలకొంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 728 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉన్నప్పటికీ 319 మిల్లీ మీటర్ల వర్షం మాత్రమే నమోదు అయింది. గత సంవత్సరం ఆగస్టు నాటికి 1077 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావడంతో పంటలకు సాగునీరు పూర్తి స్థాయిలో అందింది. జూలై మాసంలో భారీ వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు.

వర్షం కోసం ఎదురుచూస్తున్నాం..



నాలుగు ఎకరాల్లో రెండు ఎకరాల్లో పత్తి సాగు, మరో రెండు ఎకరాల్లో మిరప తోట సాగు చేసేందుకు నారు పోశాం. వర్షాలు లేకపోతే పత్తి విత్తనాలు, మిరప విత్తనాలు సక్రమంగా మొలకెత్తలేదు. ఇప్పటికే రెండు సార్లు పత్తి విత్తనాలు కొనుగోలు చేసి నాటించాను. మరో సారి కొనుగోలు చేసి పోగుంటలో నాటాల్సి ఉంది. వర్షాలు కురిస్తేనే విత్తనాలు మొలకెత్తుతాయి. వర్షాలు ఒకటి రెండు రోజుల్లో కురవకపోతే విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉండదు. దీంతో సాగుపైన ఆశలు సన్నగిల్లుతున్నాయి.

–పరుపాటి రవీందర్‌రెడ్డి, రైతు, నల్లబెల్లి

మళ్లీ ఆపరేషన్ ఆకర్ష్!

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలపై కాంగ్రెస్ ఫోకస్
- త్వరలో హస్తం గూటికి బస్వరాజు సారయ్య?
- బండా ప్రకాశ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావుపై ప్రచారం
- సోషల్ మీడియాలో సీఎం రేవంత్‌తో ప్రకాశ్ ఫొటో
- ప్రచారాన్ని కొట్టిపారేసిన ఆ ఇద్దరు ఎమ్మెల్సీలు



సాక్షిప్రతినిధి, వరంగల్: 'ఆపరేషన్ ఆకర్ష్'పై మళ్లీ ప్రచారం జోరందుకుంది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు కాంగ్రెస్ గూటికి చేరుతున్నారంటూ సోషల్ మీడియాలో పుకార్లు షికారు చేస్తున్నాయి. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తిరిగి సొంతగూటికి చేరుతారన్న ప్రచారం సాగుతోంది. ఇప్పటికే రామసహాయం సురేందర్‌రెడ్డిని కలిసిన ఆయన.. గత నెల 29న సీఎం రేవంత్ రెడ్డి సమీక్షకు హాజరై ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డితో సంప్రదింపులు జరిపినట్లు చర్చ జరుగుతోంది. బస్వరాజు సారయ్యతోపాటు మండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావులపైన సోమవారం సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న బండా ప్రకాశ్ ఫొటో చక్కర్లు కొట్టింది. అయితే దీనిపై వేర్వేరుగా స్పందించిన బండా ప్రకాశ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తమపై తప్పుడు ప్రచారం జరుగుతుందని కొట్టిపారేశారు. బీఆర్‌ఎస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ఎమ్మెల్సీ రవీందర్‌రావు స్పష్టం చేశారు. శాసనమండలి సమావేశాల సందర్భంగా కర్టసీగా సీఎంను కలిసిన ఫొటోలను తాజా ఫొటోలుగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని బండా ప్రకాశ్ పేర్కొన్నారు.

ఎమ్మెల్సీల్లో ఓరుగల్లుకు బీఆర్‌ఎస్ పెద్దపీట..

గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్సీ పదవుల్లో ఉమ్మడి వరంగల్‌కు పెద్దపీట వేశారు. ఎనిమిది మంది సీనియర్ నేతలకు అవకాశం ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో, పార్టీ ప్రస్థానంలో వెన్నుదన్నుగా ఉన్న ఈ జిల్లాకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించారు. సత్యవతి రాథోడ్, బస్వరాజు సారయ్య, పల్లా రాజేశ్వర్ రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, తక్కెళ్లపల్లి రవీందర్ రావు, బండా ప్రకాశ్, సిరికొండ మధుసూదనాచారిలకు వివిధ కేటగిరీల కింద ఎమ్మెల్సీలుగా చాన్స్ దక్కింది.

అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జనగామ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందడంతో రాజీనామా చేయగా, ఆయన స్థానానికి జరిగిన ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న(కాంగ్రెస్) ఇటీవలే గెలిచారు. ఎమ్మెల్సీగా ఉండి స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన కడియం శ్రీహరి సైతం గెలుపొందినా.. ఆయన కూడా ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీల సంఖ్య ఆరుకు తగ్గింది. కాగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలలో కలిసొచ్చే వారిపై కాంగ్రెస్ గురి పెట్టడం చర్చనీయాంశమవుతోంది.

బీఆర్‌ఎస్‌కు గట్టి షాకేనా ?

నేతల వలసలతో ఇప్పటికే సతమతమవుతున్న బీఆర్‌ఎస్ పార్టీకి ఉమ్మడి వరంగల్‌లో మరో షాక్ తగిలేలా ఉంది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలపైన కాంగ్రెస్ అధిష్టానం ఫోకస్ పెట్టడం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశం అవుతోంది. ఇప్పటికే బస్వరాజు సారయ్య కాంగ్రెస్‌లో చేరడానికి రంగం సిద్ధమైనట్లు ప్రచారం. మరోవైపు మరో ఇద్దరు ఎమ్మెల్సీలు సైతం అదే దారిలో ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గత నెల 29న సీఎం రేవంత్ వరంగల్ పర్యటన సందర్భంగా ఆయన సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో సారయ్య భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చేరికలపై చర్చించారన్న ప్రచారం జరిగింది. మాజీ ఎంపీ రామసహాయం సురేందర్ రెడ్డిని కలిసిన సందర్భంగా రెండు నెలల క్రితమే సారయ్య కాంగ్రెస్‌లో చేరుతారని భావించారు. అయితే ఆయనతోపాటు ఒకేసారి 10మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలను చేర్చుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం, సీఎం భావించి బ్రేక్ వేశారన్న ప్రచారం కూడా సాగింది. కాంగ్రెస్ పార్టీలో చేరే విషయమై ఎమ్మెల్సీ సారయ్య కూడా స్పష్టత ఇచ్చారు. డాక్టర్ బండా ప్రకాశ్, తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాత్రం చేరిక ప్రచారాన్ని ఖండిస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాశోజీ సెంటర్: జిల్లాలోని జిల్లా ప్రజా పరిషత్, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ అందజేసే 'ఉత్తమ జాతీయ ఉపాధ్యాయుల అవార్డు–2024'కు ఈ నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలని డీఈఓ వాసంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు నేషనల్ అవార్డ్స్ టు టీచర్స్.ఎడ్యుకేషన్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని వివరించారు. పూర్తి సమాచారం కోసం మండల విద్యాశాఖ అధికారులను సంప్రదించాలన్నారు.

'వనమహోత్సవ' కార్యాచరణ సిద్ధం చేయాలి

- కలెక్టర్ సత్యశారదాదేవి

కాశోజీ సెంటర్: జిల్లాలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు పటిష్ట కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ సత్యశారదా దేవి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో డీఎఫ్‌ఓ అనూజ్ అగర్వాల్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా ఈ నెల 7వ తేదీలోగా సామూహికంగా మొక్కలు నాటేందుకు జిల్లాలో అనువైన ప్రదేశాలను ఎంపిక చేసుకొని సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలు, కెనాల్, చెరువు గట్లు, అటవీ తదితర ప్రాంతాలను శాఖల వారీగా గుర్తించి నర్సరీల్లో మొక్కలను అందుబాటులో ఉంచుకొని గుంతలు తవ్వి సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాసరావు, జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎఫ్‌ఆర్‌ఓ సదానందం, డీపీఎం రేణుక, డిప్యూటీ డీఆర్‌డీఓ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారదాదేవి

'ధరణి' దరఖాస్తులు పరిష్కరించాలి

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులు వారంలోగా పరిష్కరించాలని కలెక్టర్ సత్యశారదాదేవి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందరంలో జిల్లాలోని ధరణి పెండింగ్ సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 792 దరఖాస్తులను పరిష్కరించగా, పెండింగ్‌లో ఉన్న 2,962 దరఖాస్తులను వారంలోగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్‌డీఓ కృష్ణవేణి, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, అబిద్ అలీ, పర్యవేక్షకులు విశ్వనారాయణ, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

'ధరణి' సమస్యలు పరిష్కరించండి

ప్రజావాణికి వినతుల వెల్లువ
- గ్రీవెన్స్‌లో 132 దరఖాస్తులు
- అర్జీలు సకాలంలో పరిష్కరించాలి
- కలెక్టర్ సత్యశారదాదేవి



సమస్యలు వింటున్న కలెక్టర్ సత్య శారదాదేవి



వినతులు ఇచ్చేందుకు బారులుదీరిన ప్రజలు

కాశోజీ సెంటర్: కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి'కి జనం బారులుదీరారు. ధరణి, పింఛన్ మంజూరు, పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం తదితర సమస్యలపై బాధితులు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు.

అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సత్య శారదాదేవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి స్వయంగా హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల మేరకు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఎం కార్యాలయంలోని ప్రజావాణిలో స్వీకరించిన జిల్లాకు చెందిన అర్జీలు సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌లో రెవెన్యూ శాఖ 85, మున్సిపల్ కార్పొరేషన్ 6, ఉపాధి శాఖ 6, డీఆర్‌డీఓ 4, మొత్తం 132 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. చెన్నారావుపేట మండలం తిమ్మరాయినిపహాడ్, ఎల్లాయిగూడెం కాలనీకి చెందిన కట్టయ్య, కొర్ర రాంచంద్రు, రూపిక ఎల్లయ్య తదితరులకు సుమారు 50 సంవత్సరాల క్రితం సర్వేనంబర్ 70లో ఉన్న భూమి 96 ఎకరాలను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చింది.

బ్యాంక్ రుణం కూడా ఇచ్చింది. ఇప్పుడు ధరణి వచ్చిన తర్వాత మాకు పహాణీలు ఇవ్వడం లేదు. వెంటనే కలెక్టర్ పట్టా పాస్ బుక్కులు చెల్లుబాటు అయ్యేలా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని వారు కోరారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం

చెన్నారావుపేట ఉప్పరపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థలో ఉంది. పెచ్చులు ఊడి పిల్లల మీద పడే ప్రమాదం ఉండడంతో పిల్లలు కూర్చోవడానికి భయపడుతున్నారు. కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా పరిష్కారం దొరకడం లేదు.

– ఎండీ బాషిమియా, కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు

పింఛన్ రావడం లేదు..



కరోనాకు ముందు పింఛన్ ఇచ్చిండ్రు. అనంతరం రావడం లేదు. పింఛన్ వస్తేనే కుటుంబం గడిచేది. నా కొడుకులకు ఎవరికీ ఉద్యోగం లేదు. వృద్ధాప్య పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి.

– చెరుకు దశరథం, శివనగర్.

రుణం మంజూరైనా ఇవ్వడం లేదు..



2023–24 సంవత్సరానికి కిరాణం, జనరల్ స్టోర్ ఏర్పాటు చేసుకోవడానికి రుణం మంజూరు చేశారు. కానీ ఇప్పటి వరకు లోన్ ఇవ్వడం లేదు. రుణం ఇప్పించి న్యాయం చేయాలి.

–అలకుంట మహేశ్, దివ్యాంగుడు, వర్ధన్నపేట

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- కొండాపూర్‌ను అభివృద్ధి చేస్తా
- ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి
- వనమహోత్సవ కార్యక్రమం ప్రారంభం

నల్లబెల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొండాపూర్ గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్క నాటి నీరు పోశారు. అనంతరం గ్రామ పంచాయతీ స్పెషలాఫీసర్ పవిత్ర అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాధవ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమంలో ఈ ఏడాది 20.02 కోట్ల మొక్కలను నాటేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అనంతరం సబ్ స్టేషన్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. అలాగే మద్దిమేడారం జాతర ఆలయ కమిటీ చైర్మన్ గాదె సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని సందర్శించి పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్ రావు, పాల్వాయి శ్రీనివాస్, చిట్యాల తిరుపతి రెడ్డి, రమేష్, శివారెడ్డి, అశోక్, ఇస్తారి శేఖర్, చరణ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.



కొండాపూర్‌లో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి

గార్లగడ్డతండాలో...

నర్సంపేట రూరల్: నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామ శివారులోని గార్లగడ్డతండా ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దొంతి సోమవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోతె కళావతి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక లాభాలు

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్‌రావు

కాశోజీ సెంటర్: ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటలు సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఆర్.శ్రీనివాస్‌రావు తెలిపారు. జిల్లా ఉద్యానశాఖ, రామ్‌చరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్, వరంగల్, కేఎన్ బయో సైన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సుమారు 170 మంది ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు ఆదివారం ఖమ్మంలోని సత్తుపల్లి, గంగారం, కాకర్లపల్లిలోని ఆయిల్‌పామ్ తోటను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటలుగా వక్క, కోకో, జాజికాయ, అరటి మొదలైన పంటల ద్వారా అధిక లాభాలు పొందవచ్చన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి వ్యవసాయ క్షేత్రంలో అల్యూమినియం వాల్స్ ద్వారా గెలలను కోసే విధానాన్ని రైతులకు చూపించారు. అలాగే అప్పారావుపేటలోని తెలంగాణ రాష్ట్ర నూనెగింజల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ ఆయిల్‌పామ్ కర్మాగారాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు శంకర్, తిరుపతి, జ్యోతి, సుష్మిత, మధులిక, మానస, రామ్‌చరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ సతీష్ నారాయణ, కెఎన్ బయో సైన్స్ కంపెనీ ప్రతినిధి రంజిత్, ఫీల్డ్ ఆఫీసర్స్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ సాగుపై వివరిస్తున్న శ్రీనివాస్‌రావు

క్లుప్తంగా

కేయూ ఎంబీఏ 'రెండు పేపర్ల' పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 2, 4వ తేదీల్లో జరగాల్సిన ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. నర్సింహాచారి తెలిపారు. డివిజన్ అకౌంట్స్ ఆఫీసర్స్ (వర్క్స్) గ్రేడ్–2 పరీక్ష నేపథ్యంలో ఆ రెండు రోజుల్లో జరిగే ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేశామని తెలిపారు. ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పేపర్–1 ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ ఈనెల 20న, పేపర్–2 పరీక్షను ఈనెల 22న నిర్వహిస్తామన్నారు. ఆ రెండు పరీక్షలు కూడా ఆయా రోజుల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

6 నుంచి ఎంసీఏ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంసీఏ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు (సీబీసీఎస్) రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక సోమవారం తెలిపారు. ఈనెల 6, 9, 11 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

'అదిల్'కు మెరుగైన వైద్యం అందించాలని సీఎం ఆదేశం



హన్మకొండ అర్బన్: ఇటీవల వరంగల్ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తన బాధను చెప్పుకుందామని కలవలేకపోయిన క్యాన్సర్ బాధిత బాలుడు మహమ్మద్ అదిల్ అహ్మద్ ఉదంతంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. తక్షణమే బాలుడికి మెరుగైన వైద్య సహాయం అందించాలని సీఎంఓ అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనలతో సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్ బాలుడి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి మాట్లాడారు. నెల క్రితం అదిల్ అహ్మద్ చికిత్స కోసం బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి రూ.లక్ష ఎల్‌ఓసీ ప్రభుత్వం మంజూరు చేసింది. కాగా.. ప్రస్తుతం అదిల్ అహ్మద్ ఆరోగ్య పరిస్థితిపై వేముల శ్రీనివాస్ ఆరా తీశారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా కావాల్సిన మరింత సాయం అందిస్తామని బాలుడి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

మరిపెడలో కొత్త సెక్షన్ల కింద కేసు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం బావోజీగూడెం గ్రామానికి చెందిన అజ్మీరా సీతాలు.. పని నిమిత్తం మరిపెడకు వస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వాటర్ మెన్ ఉడుతపల్లి వెంకన్న పాత కక్షల నేపథ్యంలో సీతాలుపై బావోజిగూడెం చెరువు వద్ద దాడి చేశాడు. ఈ ఘటనపై గత నెల 29 మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరిపిన పోలీసులు.. నిందితుడిపై కొత్తగా అమల్లోకి వచ్చిన భారత న్యాయ సంహిత చట్టం ప్రకారం 126(2), 118 (1), 292 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు మరిపెడ ఎస్సై గుండ్రాతి సతీష్ తెలిపారు. అదే పాత సెక్షన్లు అయితే 341, 324, 290 కింద కేసు నమోదు అయ్యేదని ఎస్సై పేర్కొన్నారు.



ప్రమోషన్.. పరేషాన్



వల్కనైజర్ల పదోన్నతుల్లో వివక్ష

- ఒకే సంస్థలో ద్వంద్వ విధానాలు
- అధికారులకు నచ్చితేనే పదోన్నతులు..
- సర్క్యులర్‌లు ఉన్నా కనిపించవు
- ఆర్టీసీ టైర్ షాప్ కార్మికుల గోడు

హన్మకొండ : టీజీఎస్ ఆర్టీసీ టైర్ వర్క్‌షాపులో పని చేస్తున్న కార్మికుల పట్ల యాజమాన్యం, అధికారులు వివక్ష చూపుతున్నారు. ఒకే సంస్థలో పని చేస్తున్నా పదోన్నతులు కల్పించడంలో ద్వంద్వ విధానాలు అవలంబిస్తూ పరేషాన్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్టీసీ టైర్ వర్క్ షాప్‌లో పని చేస్తున్న వల్కనైజర్లు 50 ఏళ్ల వయసు దాటితే వారికి ఎలాంటి డిపార్ట్‌మెంట్ టెస్ట్ లేకుండా లీడింగ్ హ్యాండ్‌గా పదోన్నతి ఇవ్వాలని ఆర్టీసీ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సర్క్యులర్ పీడీ–74/1989, జూన్ 21, 1989లో జారీ చేసింది. అయినా అధికారులకు ఈ సర్క్యులర్ కనిపించడం లేదు. వర్క్ షాప్ మేనేజర్‌కు అనుకూలంగా ఉన్న వారిని లీడింగ్ హ్యాండ్ పదోన్నతులకు ప్రతిపాదనలు పంపుతూ మిగతా వారి పట్ల వివక్ష చూపుతున్నారని కార్మికులు మొత్తుకుంటున్నారు.

అక్రమాలపై చర్యలు శూన్యం

కరీంనగర్ జోనల్ (వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ రీజినల్) టైర్ వర్క్ షాప్‌లో 28మంది ఉద్యోగులు ఉన్నారు. నెలకు 2 వేల టైర్లు రీట్రేడింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో లీడింగ్ హ్యాండ్ పదోన్నతుల్లో అక్రమాలు, అవకతవకలు జరగడంతో ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు కొన్నేళ్ల క్రితం విచారణ చేపట్టారు. అయినా అక్రమాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ జరిపించలేదని కార్మికులు తెలిపారు. 2015లో లీడింగ్ హ్యాంట్ పదోన్నతి కోసం కరీంనగర్ జోనల్ టైర్ వర్క్‌షాప్ వల్కనైజర్లకు డిపార్ట్‌మెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో అప్పటి అధికారి ఒకరు తనకు అనుకూలంగా ఉన్న నలుగురు వల్కనైజర్‌లకు సాయం చేసేందుకు అవకతవకలు, అక్రమాలకు పాల్పడ్డారని కార్మికులు యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. జవాబు పత్రాలన్నీ ఒకే హ్యాండ్ రైటింగ్‌తో పరీక్ష హాల్ బయట రాయించుకుని వచ్చి నలుగురు ఉద్యోగులు స్వయంగా రాసిన జవాబు పత్రాలు తీసివేసి బయట నుంచి తీసుకువచ్చిన ఆ జవాబు పత్రాన్ని చేర్చారనే ఆరోపణలు వెలువడ్డాయి. ఈ నలుగురు ఉత్తీర్ణులు కావడంతో వారికి రెండేళ్ల తర్వాత పదోన్నతులు కల్పించారు. దీనిపై ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు విచారణ చేశారు. తర్వాత డిపార్ట్‌మెంట్ ఎంక్వైరీ చేయాల్సి ఉన్నా ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి నిలిపి వేయించారని కార్మిక వర్గాలు మొత్తుకుంటున్నాయి. కొంత మంది సమాచార హక్కు చట్టం ప్రకారం వారు రాసిన జవాబు పత్రాల ప్రతులు ఇవ్వాలని కోరినా ఇవ్వలేదు. దీంతో ఈ పరీక్షలో కచ్చితంగా అక్రమాలు జరిగి ఉంటాయనే వాదనకు మరింత బలం చేకూరుతోంది.

సర్క్యులర్ ఉన్నా పట్టించుకోని అధికారులు..

50 ఏళ్ల వయసు నిండిన వల్కనైజర్లకు ఎలాంటి డిపార్ట్‌మెంట్ టెస్ట్ లేకుండా లీడింగ్ హ్యాండ్‌గా పదోన్నతి కల్పించాలని సర్క్యులర్ ఉన్న కొందరు అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఇదే సర్క్యులర్ ప్రకారం హైదరాబాద్ జోన్ ఉప్పల్ టైర్ వర్క్‌షాపులో 50 ఏళ్ల నిండిన వల్కనైజర్లకు లీడింగ్ హ్యాండ్‌గా పదోన్నతి కల్పించారు. కరీంనగర్ జోన్‌లోని కరీంనగర్ టైర్ వర్క్‌షాపులో పని చేస్తున్న 50 ఏళ్లు నిండిన వల్కనైజర్లకు మాత్రం పదోన్నతి ఇవ్వకుండా వివక్ష చూపుతూ ద్వంద్వ విధానాలు అవలంబిస్తున్నారు. అదే విధంగా 20 సంవత్సరాల సర్వీస్ ఇంక్రిమెంట్ 2018 నుంచి ఇవ్వాల్సి ఉన్న ఇవ్వడం లేదని ఉద్యోగులు మొత్తుకుంటున్నారు. కరీంనగర్ జోన్ కరీంనగర్ వర్క్‌షాప్‌లో పదోన్నతుల్లో జరిగిన అక్రమాలు, అవకతవకపై, జరుగుతున్న అన్యాయంపై కొందరు ఉద్యోగులు హైదరాబాద్‌లో జరిగిన ప్రజాపాలనలో సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందించారు. కొందరు అధికారులు కొందరు ఉద్యోగులపై ప్రేమ చూపించడం, మరికొందరు ఉద్యోగులపై వివక్ష చూపించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికైనా స్పందించి 50 ఏళ్లు నిండిన వల్కనైజర్లకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.



మట్టి, ఇసుక కావాలి

- దక్షిణ కొరియా యంగ్‌వన్ కంపెనీ ప్రతినిధులు
- టెక్స్‌టైల్ పార్కులో కంపెనీ పనులపై సమీక్ష
- సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ

గీసుకొండ: వరంగల్ జిల్లాలోని గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)ను దక్షిణ కొరియాకు చెందిన క్రీడా దుస్తుల తయారీ కంపెనీ(ఈటీఎల్) యంగ్ వన్ ఎవర్ టాప్ టెక్స్‌టైల్ అండ్ అపెరల్ కాంప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు సోమవారం సందర్శించారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో యంగ్‌వన్ గ్రూపు చైర్మన్ అండ్ సీఈఓ కిహాక్‌సంగ్, గ్రూపు ప్రెసిడెంట్ మిన్‌షక్‌లీ, కేఈపీజెడ్ అండ్ ఈటీఎల్ డైరెక్టర్ ఎండీ. షాజహాన్‌తో పాటు పలువురు కంపెనీ ప్రతినిధులు కేఎంటీపీకి వచ్చారు. ఈ సందర్భంగా కంపెనీ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. మహిళల కుట్టు శిక్షణ ట్రెనింగ్ సెంటర్‌ను పరిశీలించారు. అయితే కంపెనీ పనులు త్వరితగతిన చేపట్టడానికి ఇసుక, మట్టి కొరత ఉందని , వాటిని సమకూర్చాలని కోరగా కలెక్టర్ నుంచి అనుమతి తీసుకుని సమకూరుస్తామని టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ రామ సంతోష్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా సాయంత్రం కంపెనీ పనులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ కానున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కేఎంటీపీలో మొత్తం 297 ఎకరాల్లో రూ. వెయ్యి కోట్ల పెట్టుబడితో యూనిట్‌ను నెలకొల్పడానికి పనులు జరుగుతున్నాయి. 2023 జూన్ 17న అప్పటి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ భూమి పూజ చేసినా పనులు కొంత నెమ్మదిగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు కేవలం కుట్టు శిక్షణ కోసం మహిళలకు ట్రెనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం మినహా పెద్దగా పనులేమీ జరగలేదు.



కేఎంటీపీలో హెలిపాడ్ వద్ద దక్షిణ కొరియా యంగ్‌వన్ కంపెనీ ప్రతినిధులు

కళాశాలలో మౌలిక వసతుల కల్పన

- కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ

హన్మకొండ అర్బన్ : పింగిళి కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని కేయూ ఇన్‌చార్జ్ వీసీ, మహిళా, శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ వాకాటి కరుణ తెలిపారు. సోమవారం వాకాటి కరుణ హైదరాబాద్‌లోని సచివాలయంలోని తన ఛాంబర్‌లో నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్) డిగ్రీ 2023–24 సంవత్సర బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ల ఫలితాలను క్యూఆర్ కోడ్ విధానంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడి చదవడం వల్లే ఉత్తమ ఫలితాలు వచ్చాయన్నారు. ఇండియా టుడే నిర్వహించిన బెస్ట్ కాలేజీస్ ఆఫ్ ఇండియా సర్వేలో మొదటి పది ర్యాంకులలో పింగిళి కళాశాల ఉండడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి మాట్లాడుతూ డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో 486 మంది విద్యార్థులకు 278 పాసై 57.20 శాతం ఉత్తీర్ణత, రెండో సంవత్సరం నాలుగో సెమిస్టర్‌లో 440 మందికి గాను 243 పాసై 55.23 ఉత్తీర్ణత, ఆరో సెమిస్టర్‌లో 406 విద్యార్థులకు గాను 370 పాసై 85.96 ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పరీక్షల విభాగం అధికారి రామకృష్ణారెడ్డి, అడిషనల్ కంట్రోలర్స్ రేణుక, శిరీష, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, అకడమిక్ కోఆర్డినేటర్ పార్వతి, సురేష్‌బాబు, తిరువెంగళాచారి పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న వాకాటి కరుణ

కూలీ దారుణ హత్య

- రాయితో కొట్టి చంపినట్లు భావిస్తున్న స్థానికులు
- వరంగల్ బట్టలబజార్‌లో ఘటన
- బీఎన్ఎస్ఎస్ చట్టం కింద మట్టెవాడ పీఎస్‌లో తొలి కేసు నమోదు

రామన్నపేట : ఓ కూలీ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన వరంగల్ బట్టలబజార్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థాన పక్క గల్లీలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఎల్లంబజార్‌లో నివాసముంటున్న పూసల వీరభద్రచారి(52) కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం పనికి వెళ్లి వచ్చిన చారి.. రాత్రి 9.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అనంతరం తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో రక్తపు మడుగులో మృతిచెంది ఉన్నాడు. దీనిని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలిని పరిశీలించి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేసి మృతదేహాన్ని మార్చరీకి తరలించారు. మృతుడు పక్కన పెద్ద రాయి రక్తపు మరకలతో ఉంది. దీంతో రాయితో తలపై మోది చంపినట్లు ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. రాత్రి ఇంటి నుంచి క్షేమంగా బయటకు వెళ్లిన వీరభద్రచారి.. రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండడాన్ని చూసిన కుటుంబీకులు బోరున విలపించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ

హత్య ఘటన స్థలాన్ని వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ సందర్శించారు. వీరభద్రచారి హత్యకు గురయ్యాడా? లేక ఇతర ప్రమాదమా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఘటన జరిగిన చుట్టూ పక్కల ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీ సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. కాగా, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ఎస్ (భారత్ న్యాయ సంహిత) 103(1) చట్టం కింద తొలి కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ సీఐ గోపి తెలిపారు.



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఏసీపీ నందిరాం

ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సోమవారం నిర్వహించిన వరంగల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అండర్–8,10,12 బాల బాలికల విభాగంలో నిర్వహించిన ఎంపికల్లో జిల్లా నలుమూలల నుంచి 240 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి యుగెంధర్‌రెడ్డి తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 15 మంది క్రీడాకారులను ఈ నెల 7వ తేదీన గోపిచంద్ అకాడమీ గచ్చిబౌలిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కాగా, సంఘం రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఈటీలు కృష్ణమూర్తి, మహేందర్, నాగరాజు, శ్రీలత, రమేష్, శ్రీనాథ్, సతీష్ , శ్రీనివాస్, కోచ్ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న బాలికలు

పలు రైళ్లు దారి మళ్లింపు

- తెలంగాణ సూపర్‌ఫాస్ట్‌కు అప్‌అండ్‌డౌన్‌లో తాత్కాలిక హాల్టింగ్ ఎత్తివేత

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను దారి మళ్లించి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు సోమవారం . కాజీపేట–బల్లార్షా సెక్షన్‌లో మూడో రైల్వే లైన్ కారణంగా కాజీపేట మీదుగా అప్ అండ్ డౌన్ చేసే పలు రైళ్లను దారి మళ్లించి నడిపిస్తున్నట్లు తెలిపారు.

దారి మళ్లించిన రైళ్ల వివరాలు

గోరఖ్‌పూర్–యశ్వంత్‌పూర్ (12591) వీక్లీ ఎక్స్‌ప్రెస్ జూన్ 6 నుంచి జూలై 7వ తేదీ వరకు, యశ్వంత్‌పూర్–గోరఖ్‌పూర్ (12592) వీక్లీ ఎక్స్‌ప్రెస్ జూన్ 24 నుంచి జూలై 1వ తేదీ వరకు, గోరఖ్‌పూర్–సికింద్రాబాద్ (12589) వీక్లీ ఎక్స్‌ప్రెస్ జూన్ 26 నుంచి జూలై 3వ తేదీ వరకు, సికింద్రాబాద్–గోరఖ్‌పూర్ (12590) వీక్లీ ఎక్స్‌ప్రెస్ జూన్ 27 నుంచి జూలై 4వ తేదీ వరకు, సికింద్రాబాద్–న్యూఢిల్లీ (12723) తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ ట్రెన్ జూలై 4,5,6 తేదీల్లో, న్యూఢిల్లీ–హైదరాబాద్ (12724) తెలంగాణ సూపర్ ఫాస్ట్ రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ జూలై 3,4,5వ తేదీల్లో వయా నిజామాబాద్ మీదుగా సికింద్రాబాద్‌కు దారి మళ్లించినట్లు తెలిపారు. దారి మళ్లింపు కారణంగా ఈ రైళ్లకు బల్లార్షా, బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, కాజీపేట జంక్షన్‌లో తాత్కాలికంగా హాల్టింగ్ ఎత్తివేసినట్లు తెలిపారు.

స్కూల్ బస్సు ఢీకొని రైతు దుర్మరణం

- పైడిపల్లిలో ఘటన

పరకాల: స్కూల్ బస్సు ఢీకొని ఓ రైతు దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం పరకాల మండలం పైడిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాగుల రాజయ్య(65) బైక్‌పై పరకాల వచ్చి మిరపనారు కొనుగోలు చేశాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో పైడిపల్లిలోని మలుపు వద్ద స్కూల్ బస్సు ఢీకొంది. దీంతో రాజయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరకాల ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



రాజయ్య(ఫైల్)

ఆర్థిక సమస్యలతో ఎంపీటీసీ ఆత్మహత్య

- ఎల్లంల గ్రామంలో ఘటన

జనగామ రూరల్ : తెల్లవారితే ప్రజాసమస్యలపై సర్వసభ్య సమావేశంలో మాట్లాడే సమయం.. అంతలోనే అనంతలోకాలకు చేరింది. ఆర్థిక సమస్యలతో ఓ ఎంపీటీసీ కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన సోమవారం జనగామ మండలంలోని ఎల్లంలలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన ఎంపీటీసీ బండ లక్ష్మి (47) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందుతోంది. దీనిపై కుటుంబ సభ్యులు ధైర్యం చెబుతూ వస్తున్నారు. అయినా మనస్తాపానికి గురవుతూనే ఉంది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కిరోసిన్ పోసుకుని నిప్పు అంటించుకుంది. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబీకులు వెంటనే హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి సోదరుడు బుడిగే సిద్దులు ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ఎస్ ప్రకారం 194 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు.



లక్ష్మి (ఫైల్)

అంబేడ్కర్‌నగర్‌లో యువకుడు..

రాయపర్తి (వర్ధన్నపేట): జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు.. ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వర్ధన్నపేట మండలం అంబేడ్కర్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన బంక సంజీవ్‌కుమార్‌కు ఇద్దరు కొడుకులు, ఓ కుమార్తె ఉండగా హైదరాబాద్‌లో కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో సంజీవ్‌కుమార్ పెద్దకుమారుడు వికాస్(22) పదిహేనురోజుల క్రితం సొంత గ్రామం అంబేడ్కర్‌నగర్‌కు వచ్చి కూలీ పనులు చేస్తూ ఉంటున్నాడు. ఈ క్రమంలో ఒంటరితనం భరించలేక.. జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి సంజీవ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, బీఎన్ఎస్ఎస్ చట్టం కింద వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో మొదటి కేసుగా నమోదైనట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.



వికాస్ మృతదేహం

ఫ్యూజ్ సరిచేస్తూ మృత్యుఒడికి..

- విద్యుదాఘాతంతో జీపీ వర్కర్ మృతి
- ఎల్గూర్‌రంగంపేటలో ఘటన

సంగెం: విద్యుదాఘాతంతో జీపీ మల్టీపర్పస్ వర్కర్ మృతి చెందాడు. ఈ ఘటన సంగెం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్గూర్‌రంగంపేట గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ కడారి సూరయ్య(58) సోమవారం గ్రామంలోని రైస్ మిల్లు ఎదుట ఉన్న సింగిల్ ఫేజ్ డీటీఆర్ ఫ్యూజ్ వేయడానికి నిచ్చెన వేసుకుని స్తంభం ఎక్కాడు. ఫ్యూజ్ సరిచేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి తల్లి ఉప్పలమ్మ, భార్య రాజమణి, కుమారుడు రంజిత్, కూతురు రాధిక ఉన్నారు. కాగా, దివ్యాంగురాలైన కూతురుకు వివాహం జరగగా కుమారుడు అక్షిత్ జన్మించాడు. అయితే అల్లుడు శాబోత్ సుమన్ మూడేళ్ల క్రితం భార్యాపిల్లలను వదిలి వెళ్లాడు. దీంతో సూరయ్యనే కూతురు, మనవడి బాగోగులు చూసుకుంటున్నాడు. ఈక్రమంలో సూరయ్య మృతి చెందడంతో బంధువులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు రంజిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.



సూరయ్య (ఫైల్)

యువకుడిపై గంజాయి గ్యాంగ్ దాడి

- చెన్నారెడ్డి కాలనీలో ఘటన
- ఫిర్యాదు చేసినా కేసు నమోదు కాలేదని ప్రచారం
- ఒక్కటైన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు
- అధికార పార్టీ నేత అనుచరుడి కనుసన్నల్లో రాజీ

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ చెన్నారెడ్డి కాలనీలో ఆదివారం రాత్రి ఓ యువకుడిపై అదే కాలనీకి చెందిన కొందరు యువకులు(గంజాయి సేవించే గ్యాంగ్) దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఆ యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. గరీబ్‌నగర్‌కు చెందిన యువకుడు ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో చెన్నారెడ్డికాలనీలోని బంధువుల ఇంటికి బైక్‌పై వస్తుండగా అదేకాలనీకి చెందిన కొందరు యువకులు దాడికి పాల్పడ్డారు. స్థానికులు ఆపే ప్రయత్నం చేస్తే వారిపై కూడా దాడికి పాల్పడ్డారు. దీంతో సదరు యువకుడి బంధువులు డయల్ 100కు కాల్ చేయగా మిల్స్‌కాలనీ పోలీసులు వచ్చి బైక్ ఫొటోలు తీసుకుని యువకుడిని ఎంజీఎం వెళ్లమని ఉచిత సలహా ఇచ్చి వెళ్లిపోయారు. చికిత్స పొందిన యువకుడు సోమవారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఘటన బయటకు తెలియడంతో దాడికి పాల్పడిన యువకుల బంధువులు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో మధ్యాహ్నం డివిజన్‌కు చెందిన అధికార, ప్రతిపక్షాల నాయకులను సంప్రదించారు. ఈమేరకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ నాయకులు తూర్పు నేత ప్రధాన అనుచరుడి కనుసన్నల్లో రాజీ కుదిర్చినట్లు ప్రచారం జరుగుతోంది. చెన్నారెడ్డి కాలనీలో కొంత కాలంగా కొందరు యువకులు గంజాయి సేవిస్తూ గ్యాంగ్‌గా ఏర్పడి అల్లర్లకు పాల్పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఎవరైనా ఎదురు తిరిగితే వారిపై దాడి చేయడానికి కూడా ప్రయత్నిస్తున్నారని కాలనీవాసులు అంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఇలాంటి ఘటనలపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే కాలనీలో రాత్రి సమయంలో పెట్రోలింగ్ చేయాలని కోరుతున్నారు.



యువకుడిపై దాడి చేస్తున్న యువకులు(సీసీ ఫుటేజీ)

వేర్వేరు కారణాలతో ముగ్గురు మృతి

ఎద్దు పొడిచి రైతు..

మహబూబాబాద్ రూరల్: ఎద్దు పొడిచి ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మహబూబాబాద్ మండలం ఇస్లావత్ తండా(ఎస్) జీపీ పరిధి బిచ్యా తండాలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి కథనం ప్రకారం.. తండాకు చెందిన రైతు బానోత్ శ్రీను (47) ఆదివారం అర్ధరాత్రి వర్షం కురుస్తుండగా తన రెండు ఎద్దులను ఇంటి వెనుక ఉన్న రేకుల షెడ్డులోకి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఎద్దులు పొడుచుకుంటూ వచ్చి అందులో ఒకటి శ్రీను తలపై బలంగా పొడిచింది. దీంతో తీవ్రగాయం కావడంతో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య నాన్కు ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై దీపికారెడ్డి, కానిస్టేబుళ్లు లింగారావు, కిషన్.. ఘటనా స్థలికి చేరుకుని పంచనామా నిర్వహించి శ్రీను మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కాగా, గతంలో 174 సీఆర్‌పీసీ ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసే వారు. కొత్త చట్టాల అమలులో భాగంగా సెక్షన్ 194 బీఎన్ఎస్ఎస్ ప్రకారం కేసు నమోదు చేశారు.



శ్రీను (ఫైల్)

చికిత్స పొందుతున్న యువకుడు..

దోర్నకల్: మండలంలోని హూన్యాతండాకు చెందిన ఓ యువకుడు మూడు వారాల నుంచి చికిత్స పొందుతూ చెందాడు. డోర్నకల్ ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. తండాకు చెందిన భూక్య బిక్కు(28) గత నెల 12న తెల్లవారుజామున నిద్ర లేస్తూ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి గన్యా ఫిర్యాదు మేరకు కొత్త సెక్షన్ 194 బీఎన్ఎస్ఎస్ ప్రకారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని మృతదేహానికి మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమవారం తెలిపారు. కాగా, బిక్కు చికిత్స పొందుతూ మృతి చెందగా తండ్రి గన్యా ఫిర్యాదు మేరకు 194 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు. అసహజ మరణాలకు సంబంధించి ఈ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేస్తామని, గతంలో 174 సీఆర్‌పీసీ ప్రకారం కేసు నమోదు అయ్యేదని సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు.



బిక్కు(ఫైల్)

అనుమానాస్పద స్థితిలో మరో యువకుడు..

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం అన్నారం సమీపంలోని గ్రావిటీకాల్వలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం ... మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం చింతలపల్లికి చెందిన నైతం శేఖర్(27) ఆదివారం అన్నారం దుబ్బగూడెంలోని భార్య నేహ ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో అదేరోజు రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో శేఖర్ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. సోమవారం గ్రావిటీ కాల్వలో రాళ్ల మధ్య శేఖర్ మృతదేహం లభ్యమైంది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడ్డాడా! లేదా ఎవరైనా హతమార్చారా అనే కోణంలో విచారణ చేపడుతున్నారు. కాగా, ఈ ఘటనపై మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కాటారం సీఐ నాగార్జునరావు, కాళేశ్వరం ఎస్సై చక్రపాణి పరిశీలించి మహదేవపూర్ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.



శేఖర్ మృతదేహం